# నేను బతికే వున్నాను

## GHOST

మహావాది

ఆకాశం మేఘావృతంగా ఉంది.

మెరుపులు ఉండి ఉండి మెరుస్తున్నాయ్...

అవి మెరిసినప్పుడల్లా తళుక్కుమన్న కాంతులు కిటికీ అద్దాల మీద ప్రతిఫలిస్తున్నాయి. ఇంటి ఆవరణలోని చెట్లు జుట్టు విరబోసుకున్న దయ్యాల్లా ఊగుతున్నాయి. ఇవేమీ పట్టనట్లుగా మేరీ తన గదిలో గాఢనిద్రలో ఉంది. ఆ అమ్మాయికి పదహారేళ్ళుంటాయి. భుజాల దాకా కత్తిరించిన జుట్టు దిండంతా పరుచుకొని ఉంది. ఫాల భాగం మీదకి వాలిన ముంగురులు ముద్దు గొలుపుతున్నాయి. ఎదుగుతున్న ఆమె యవ్వనపు శోభలు మగవాళ్ళను సవాల్ చేసేట్లున్నాయ్. నైట్‌గౌన్ కింద, పుష్టిగా పెరిగిన రొమ్ములు ఉచ్ఛ్వాస నిశ్వాసలకు బరువుగా కదులుతున్నాయి. నిద్రలో గౌను పైకి లేచిపోవటంతో బయటపడ్డ అరటి బోదెల వంటి తొడలు పాలరాయిలా మెరుస్తున్నాయి.

సడన్‌గా మేరీకి తన మీద ఏదో బరువు పడినట్లుగా అనిపించింది... గభాలున నిద్ర నుంచి తెప్పరిల్లి లేవటానికి ప్రయత్నించింది. ఏవో బలమైన రెండు హస్తాలు ఆమెను మంచానికి అదిమి పెడుతున్నాయి. నల్లగా మంచులా ఉన్న ఆ ప్రేతంను ఆమె చూడలేక పోతున్నది. భయంతో గొంతు తడారిపోయింది. తన గుండె వేసే చప్పుడు స్పష్టంగా ఆమెకు వినిపిస్తున్నది. దిక్కులు పిక్కటిల్లేట్లు పెద్దగా కేక పెట్టబోయింది. 'డాడీ!... డాడీ!...'

స్వరం బయటకు రాలేక గొంతులోనే ఉండిపోయింది. నిస్సహాయంగా ఆ పట్టు నుంచి బయట పడటానికి గింజుకోసాగింది.

చల్లని మంచు తెర ముఖం మీదుగా పాకిన అనుభూతి... క్రమంగా మేరీకి స్పృహ తప్పసాగింది. స్పృహ కోల్పోతుండగా కనిపించిన దృశ్యం ఆమెను భయకంపితురాలిని చేసింది.

మేరీ మీద నుండి కిందకు దిగిన ఒక పొట్టి వృద్ధుడు పదే పదే వెనక్కు చూసుకుంటూ పక్కనే ఉన్న గోడలోకి వెళ్ళి మాయమయ్యాడు.

మరునాటి రాత్రి...

"కెవ్!"... మన్న కేకతో ఆ ఇల్లు ప్రతిధ్వనించింది.

'బెయిన్స్ స్మిత్', బెడ్ మీద నుండి దూకి ఒక్క పరుగులో బయటకు వచ్చాడు.

"మమ్మీ!...మమ్మీ!... సేవ్ మీ!..." పెద్దగా ఏడుస్తూ అతడి ఐదు సంవత్సరాల కూతురు 'తులిప్', తల్లి బెడ్‌రూమ్ వైపుకు పరిగెత్తటం కనిపించింది.

అతడు పరిస్థితిని అర్థం చేసుకునే



లోపలే 'తులిప్' తల్లి చేతుల్లో స్పృహ కోల్పోయింది.

"బేబీ!... బేబీ!...ఏమయిందమ్మా?"... మొహం మీద నీళ్ళు కొద్దిగా చిలకరిస్తూ అడిగాడు బెయిన్స్.

కొద్దిగా కదిలి కళ్ళు తెరిచింది తులిప్.

ఆ అమ్మాయిని భయకంపితురాలిని చేసిన దృశ్యం ఇంకా వెంటాడుతూనే ఉంది. భయంతో గట్టిగా కళ్ళు మూసుకుంది. చలిజ్వరం వచ్చిన దానిలా ఆమె శరీరం వణకటం స్పష్టంగా కనిపిస్తున్నది.

"బేబీ!... నీకేం భయం లేదు... నేను మీ డాడీని"... లాలనగా ఆమె తల నిమిరాడు. బెయిన్స్ భార్యకు ఇదేమీ అంతుబట్టటం లేదు.

క్రమంగా తేరుకుంది తులిప్. "డాడీ!... ఆ ముసలాడ్ని మనింట్లోంచి గెంటెయ్ డాడీ!... మన రూమ్ గోడలో దాక్కొని నన్ను బెదిరిస్తున్నాడు"...

బెయిన్స్‌కు ఆ మాటలు నమ్మశక్యం కాలేదు. న్యూ హాంప్షైర్‌లోని ఆ ఇంటిని ఇటీవలే అతడు కొన్నాడు. వంద సంవత్సరాల నాటి ఆ ఇల్లు బాగా శిథిలావస్థలో ఉంది. ఇంటిలోపల గోడలు బాగా బీటలు వారిపోయి కొన్ని చోట్ల పిచ్చి మొక్కలు పెరిగాయి. ఐరన్ ఫిటింగ్స్ చాల వరకు తుప్పుపట్టి పోయాయి. అందువల్ల బెయిన్స్ పనివాళ్ళను పిలిపించి ఇల్లంతా బాగు చేయించటం మొదలు పెట్టాడు. త్వరలోనే ఇల్లు పూర్వపు కళను పొందసాగింది. అంతా సవ్యంగా జరిగిపోతున్నప్పుడు ఈ విపత్కరమేమిటో అతడికి అర్థం కాలేదు. ఆ కుటుంబం నిద్రపోకుండా తెల్లవార్లూ మేల్కొనే కాలక్షేపం చేసారు.

తెల్లవారింది. ప్రభాత కిరణాలతో, పక్షుల కిలకిలా రావాలతో ప్రకృతి కాంత పులకించసాగింది. ముచ్చటగా ఉన్న ప్రకృతి రమణీయకతకు పరవశించే అతడు ఈ ఇంటిని కొన్నాడు. రాత్రి జరిగిన హడావిడి ఒక భ్రమేమో అనిపించిందతడికి. కాని నిజమేనన్నట్లు దిగాలుగా ఉన్న ముఖాలతో భార్యా బిడ్డలు కనిపించారు. తలుపు తట్టిన చప్పుడైంది...

# STORY


తలుపు తీశాడు బెయిన్స్. ఇంటిపని వాళ్ళు లోపలకు ప్రవేశించారు. ఆ రోజు వాళ్ళు బాత్‌రూమ్‌లో పని పూర్తి చెయ్యాల్సి ఉంది. అక్కడ ఉన్న తుప్పుపట్టిన పాత స్టీలు టబ్‌ను కొద్ది రోజుల క్రితం వాళ్ళు దూరంగా జరిపేసారు. ఆ చోట్లో మరో కొత్త టబ్‌ను ఏర్పాటు చెయ్యబోతున్నారు.

"మిస్టర్ బెయిన్స్!... మరొకసారి వచ్చి చూసి మార్పులేవన్నా చెబితే మేము పని మొదలు పెడతాము"... మేస్త్రీ అన్నాడు. బెయిన్స్ బాత్‌రూమ్‌లోకి నడిచాడు. మేస్త్రీ ఆజ్ఞతో పనివాళ్ళు తుప్పుపట్టిన పాత తొట్టిని బయట పడేయటానికి ఎత్తబోయ్యారు.

అప్పుడు జరిగిందొక బీభత్సం...

కిచెన్‌లోని గ్లాసులు, పళ్ళాలు, చిన్న చిన్న రాళ్ళు వర్షంలాగా ఆ గదిలోని వాళ్ళ మీద కురిసాయి. నెత్తురోడుతున్న శరీరాల్తో బెయిన్స్‌తో సహా అందరూ బయటకు పారిపోయ్యారు. ఇందులో మానవమాత్రుల ప్రమేయం లేదనిపించింది బెయిన్స్‌కు. అతడికి మిగిలిన ఛాయిస్ ఒక్కటే...

ప్రఖ్యాతి చెందిన పారాసైకాలజిస్టు సార్మన్ గోథియర్— బెయిన్స్ ఇంటికి వచ్చాడు. భూత ప్రేతాలను పారద్రోలటంలో గొప్ప నిపుణుడిగా అతడికి పేరుంది. అతడి వెంట ఇద్దరు వ్యక్తులున్నారు. ఒకరు చర్చి ఫాదరు. మరొకరు భూతాలను కాంటాక్టు చెయ్యటానికి మీడియంగా వ్యవహరించే వ్యక్తి. ఆ ఇంట్లో అడుగుపెట్టిన మరుక్షణం అక్కడొక ఆత్మ సంచరిస్తున్న సంగతి గోథియర్‌కు అర్థమైపోయింది. వచ్చే ముందే ఆ ఇంటికి సంబంధించిన కొన్ని వివరాలు అతడు సేకరించుకొని వచ్చాడు. "మిస్టర్ బెయిన్స్!.. .. ఈ ఇంటి పాత యజమాని పేరు ఫిలిప్. తన అరవై మూడవ ఏట గుండెపోటుతో అతడు సడన్‌గా చనిపోయాడు. ఆ సమయంలో అతడు బాత్ టబ్‌లో స్నానం చేస్తున్నాడు. ఏది హా!... ఈ ఆత్మ సంగతి మేము తేల్చుకుంటాం"... గోథియర్ బృందం, ఫిలిప్ ఆత్మను కాంటాక్టు చెయ్యటానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. కొద్ది



సేపట్లోనే నిప్పులు చెరుగుతున్న కళ్ళతో వృద్ధుడు ప్రత్యక్షమయ్యాడు.

"నీ పేరు ఫిలిప్ కదూ!..."

"అవును..."

"వాళ్ళ నెందుకు బాధ పెడుతున్నావ్?"

"బాధ పెడుతున్నానా?... హ్హ హ్హ"... వికృతంగా నవ్వాడా వృద్ధుడు.

"నా ఇంట్లో చేరి అన్నీ అస్తవ్యస్తం చేస్తుంది చాలక, ఈ మాయలు కూడానా?... ఆఖరికి నేను రోజూ స్నానం చేసే టబ్‌ను కూడా జరిపేసారు. ఇంక నేనెంత మాత్రం సహించను"...

"మిస్టర్ ఫిలిప్!... నీ శ్రేయోభిలాషిగా నీకు ఉపకారం చేద్దామనే వచ్చాను. ఈ ఇల్లు నీది కాదు. నువ్వు చనిపోయి చాలా కాలం అయింది. చనిపోయిన తరువాత కూడా నువ్విక్కడే తిరగటంతో నీ వారసులు ఇల్లు పాడుపెట్టేసారు"— అనునయంగా అన్నాడు గోథియర్.

"నేన్నమ్మను... నేను చనిపోలేదు. బతికే ఉన్నాను. నా ఇల్లు కాజేయటానికి మీరల్లిన కట్టు కథ ఇది"... కోపంగా అరిచాడు వృద్ధుడు.

"ఫిలిప్!... నీ భార్య 'అర్థియా' చనిపోయిన సంగతి నీకు తెలుసా?"...

"ఎప్పుడు?"... విచారంగా అడిగాడు వృద్ధుడు.

"నువ్వు మరణించిన కొద్ది కాలానికే నీ భార్య కూడా చనిపోయింది. ఆమె ఆత్మను నువ్వు కలుసుకోలేదా?"...

"ఆమె నాకెప్పుడూ కనబడలేదు"... దిగులుగా అన్నాడు వృద్ధుడు.

"పోనీ ఇతర ఆత్మలేమైనా కనబడ్డాయా?"...

తల అడ్డంగా ఆడించాడు వృద్ధుడు. "నేను నా ఇంట్లోనే ఉంటున్నాను. బయట ఏం ఉందో నాకు తెలీదు"...

గోథియర్‌కు ఆ భూతం మీద జాలి వేసింది.

"ఫిలిప్!... నువ్వు నిజంగానే చనిపోయావు. అకస్మాత్తుగా బాత్ టబ్‌లో నీ ప్రాణం పోవటంతో నువ్వు బతికే ఉన్నావన్న భ్రమలో ఉన్నావు.

ఈ ఇల్లు విడిచిపెట్టి నీ గమ్యం వెతుక్కుంటూ వెళ్ళిపో!... భగవంతుడు నీకు మేలు చేస్తాడు."

ఫిలిప్‌కు తన పరిస్థితి అర్థం అయింది. దిగులుగా అందరి వంక ఒకసారి చూసి పక్కనే ఉన్న తలుపులో ప్రవేశించి మాయమయ్యాడు. ఇక మళ్ళీ ఎవరికీ కనిపించలేదతడు.

హనుమంతరాయలు